
మైత్రినగర్‌లో పర్యటిస్తున్న జీహెచ్‌ఎంసీ కాంగ్రెస్ ఫ్లోర్ లీడర్ రాజశేఖర్‌రెడ్డి



రంగారెడ్డి జిల్లా కోర్టు వద్ద దీక్షాదివసను నిర్వహించిన న్యాయవాదులు


మీర్‌పేట్‌లో దీక్షా దివస్‌లో బీఆర్ఎస్ నాయకులు, కార్పొరేటర్లు, కార్యకర్తలు


ఆజంపుర నుంచి ర్యాలీగా వెళ్తున్న బీఆర్ఎస్ నేతలు ఆజంఅలీ, తీగల అజిత్‌రెడ్డి, సామ ప్రభాకర్‌రెడ్డి తదితరులు

పార్టీలకు అతీతంగా సమస్యల పరిష్కారం

- జీహెచ్‌ఎంసీ కాంగ్రెస్ ఫ్లోర్ లీడర్ రాజశేఖర్‌రెడ్డి

ఎల్బీనగర్, నవంబరు 29(ఆంధ్రజ్యోతి): పార్టీలకు అతీతంగా సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకుంటున్నట్లు జీహెచ్‌ఎంసీ కాంగ్రెస్ ఫ్లోర్ లీడర్ దరిపల్లి రాజశేఖర్‌రెడ్డి చెప్పారు. మైత్రినగర్‌కాలనీలో సీసీ రోడ్డును శుక్రవారం ఆయన ప్రారంభించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ 5సంవత్సరాలుగా మైత్రినగర్‌కాలనీ రోడ్‌నంబర్ 8లో రోడ్డు నిర్మాణం చేపట్టాలని కాలనీవాసులు మొరపెట్టుకుంటున్నా పట్టించుకున్ననాథుడు కరువయ్యాడన్నారు. మైత్రినగర్ ప్రజల కోరిక మేరకు రోడ్డు పనులు చేపట్టి పూర్తిచేయడం జరిగిందన్నారు. జీహెచ్‌ఎంసీ ఎల్బీనగర్ సర్కిల్ ఈఈ కార్తీక్, డీఈ రవిచంద్ర, ఏఈ విజయ్ పాల్గొన్నారు.


కమ్యూనిటీ భవనానికి శంకుస్థాపన చేస్తున్న చైర్‌పర్సన్ జయశ్రీ తదితరులు

కమ్యూనిటీ భవనానికి శంకుస్థాపన

అబ్దుల్లాపూర్‌మెట్, నవంబరు 29(ఆంధ్రజ్యోతి): పెద్దఅంబర్‌పేట్‌లోని 7వ వార్డులో రూ. 40లక్షలతో చేపట్టిన కమ్యూనిటీ భవనానికి శుక్రవారం మున్సిపల్ చైర్‌పర్సన్ జయశ్రీరాజు, వైస్ చైర్మన్ సంపూర్ణావిజయశేఖర్‌రెడ్డి, స్థానిక కౌన్సిలర్ దండెం కృష్ణారెడ్డితో కలిసి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మున్సిపాలిటీ పరిధిలోని కాలనీల్లో మౌలిక సదుపాయాల కల్పనకు కృషి చేస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో కమిషనర్ రవీందర్‌రెడ్డి, కౌన్సిలర్లు సిద్ధంకి కృష్ణారెడ్డి, పసుల రాజేందర్‌ముదిరాజ్, డీఈఈ శివానందం, కో-ఆప్షన్ సభ్యుడు ఖలీం, సురేష్, కాలనీవాసులు పాల్గొన్నారు.

శారీరక దృఢత్వానికి వ్యాయామం తప్పనిసరి

మన్సూరాబాద్, నవంబరు 29(ఆంధ్రజ్యోతి): దైనందిన జీవితంలో మానసిక ప్రశాంతత, శరీరం దృఢత్వంగా చురుగ్గా ఉండేందుకు ప్రతినిత్యం వ్యాయామం తప్పనిసరిగా చేయాలని నాగోల్ కార్పొరేటర్ చింతల అరుణాసురేందర్‌యాదవ్ పేర్కొన్నారు. డివిజన్ పరిధిలోని సహభావన టౌన్‌షిప్ సీ-బ్లాక్‌లో నూతనంగా ఏర్పాటు చేసిన ఓపెన్ జిమ్‌ను శుక్రవారం ఆమె ముఖ్యఅతిథిగా విచ్చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ వ్యాయామం వల్ల కలిగే ప్రయోజనాలను వివరించి ఓపెన్‌జిమ్‌ను ప్రతిఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని నివాసితులకు సూచించారు. కార్యక్రమంలో ఓబీసీ మోర్చా రాష్ట్ర ఉపాధ్యక్షుడు చింతల సురేందర్‌యాదవ్, సీ-బ్లాక్ అధ్యక్షుడు శ్రీనివాసరావు, నల్ల మునిందర్, చంద్రశేఖర్, వెంకట్‌రెడ్డి, శ్రీనివాస్, రాజశేఖర్, విక్రమ్‌రెడ్డి పాల్గొన్నారు.


ఓపెన్ జిమ్ పరికరాలను పరిశీలిస్తున్న కార్పొరేటర్ లచ్చిరెడ్డి

ఓపెన్ జిమ్‌లను సద్వినియోగం చేసుకోవాలి

వనస్థలిపురం, నవంబరు 29(ఆంధ్రజ్యోతి): ప్రజల ఆరోగ్య పరిరక్షణ కోసం పార్కుల్లో ఏర్పాటు చేసిన ఓపెన్ జిమ్‌లను సద్వినియోగం చేసుకోవాలని బీఎన్‌రెడ్డినగర్ కార్పొరేటర్ మొద్దు లచ్చిరెడ్డి అన్నారు. బీఎన్‌రెడ్డినగర్ ఫేజ్-1 పార్కులో ఏర్పాటు చేసిన ఓపెన్ జిమ్ పరికరాలను కార్పొరేటర్ శుక్రవారం పర్యవేక్షించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ కాలనీవాసులు తమ ఆరోగ్య పరిరక్షణకు ఓపెన్ జిమ్‌లను సద్వినియోగం చేసుకోవాలన్నారు. కాలనీవాసులు పాల్గొన్నారు.


ఇంద్రసేనారెడ్డికి జ్ఞాపికను అందజేస్తున్న సురేందర్‌రెడ్డి, ఉమాదేవి దంపతులు

నూతన దంపతులకు గవర్నర్ శుభాకాంక్షలు

కొత్తపేట, నవంబరు 29(ఆంధ్రజ్యోతి): త్రిపుర రాష్ట్ర గవర్నర్ నల్లు ఇంద్రసేనారెడ్డి ఎల్బీనగర్ స్నేహపురికాలనీ అధ్యక్షుడు అనంతుల సురేందర్‌రెడ్డి గృహాన్ని సందర్శించారు. కొద్ది రోజుల క్రితం సురేందర్‌రెడ్డి ఉమాదేవి దంపతుల రెండవ కుమార్తె జాన్వి వివాహం యశ్వంత్‌రెడ్డితో నిర్వహించారు. వారి వివాహ వేడుకలకు గవర్నర్ ఇంద్రసేనారెడ్డి హాజరు కాలేకపోయారు. దీంతో ఆయన గురువారం రాత్రి సురేందర్‌రెడ్డి ఇంటికి విచ్చేసి నూతన దంపతులైన జాన్వి, యశ్వంత్‌రెడ్డిలను ఆశీర్వదించి శుభాకాంక్షలు తెలిపారు. అనంతుల సురేందర్‌రెడ్డి, ఉమాదేవి దంపతులు గవర్నర్ ఇంద్రసేనారెడ్డికి జ్ఞాపికను అందజేశారు. కార్పొరేటర్ పవన్‌కుమార్ సహా పలువురు నాయకులు, అధికారులు, స్నేహపురికాలనీ ప్రతినిధులు పాల్గొన్నారు.

జువెనైల్ హోం ఆర్చరీ విద్యార్థులకు చేయూత

సైదాబాద్, నవంబరు 29(ఆంధ్రజ్యోతి): జాతీయ స్థాయిలో ఆర్చరీ పోటీల్లో రాణిస్తున్న జువెనైల్ హోం విద్యార్థులను హైకోర్టు జస్టిస్ భీమపాక నగేష్ అభినందించారు. శుక్రవారం హైకోర్టు చాంబర్‌లో జస్టిస్‌ను విద్యార్థులు కలిశారు. వారికి ఐదు సైకిళ్లు, ట్రాక్ సూట్‌లను బహుమతిగా అందజేశారు. ఆర్చరీ శిక్షణకు అన్ని విధాల సహకరిస్తానని హామీ ఇచ్చినట్లు అధికారులు తెలిపారు. కార్యక్రమంలో జువెనైల్ శాఖ డిప్యూటీ డైరెక్టర్ డాక్టర్ బేగ్, హెచ్‌ఎం కళ్యాణి పాల్గొన్నారు.

ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన


అవగాహన కల్పిస్తున్న ఇన్‌స్పెక్టర్ అర్జున్

కొత్తపేట, నవంబరు 29(ఆంధ్రజ్యోతి): ప్రమాదాల బారిన పడకుండా వాహన ప్రయాణానికి పిల్లలందరూ ట్రాఫిక్ నిబంధనలపై అగాహన పెంచుకోవాలని రాచకొండ ట్రాఫిక్ ట్రెయినింగ్ ఇనిస్టిట్యూట్(టీటీఐ)ఇన్‌స్పెక్టర్ అర్జున్ అన్నారు. శుక్రవారం చెంగిచెర్ల మెరీడియన్ స్కూల్ నుంచి 80మంది విద్యార్థులు ఎల్బీనగర్ ట్రాఫిక్ కాంప్లెక్స్‌లోని రాచకొండ పిల్లల ట్రాఫిక్ శిక్షణ పార్కును సందర్శించారు. కార్యక్రమంలో టీటీఐ ఏఎస్‌ఐ సోమ్‌నాథ్, సేఫ్టి ట్రెయినర్ ప్రవీణ్, సిబ్బంది రమేష్ విద్యార్థులు పాల్గొన్నారు.

12 అవగాహన కార్యక్రమాల్లో 1215 మంది విద్యార్థులు

వివిధ పాఠశాలలను సందర్శిస్తూ ట్రాఫిక్ నిబంధనలపై, సురక్షిత ప్రయాణంపై అవగాహన కల్పిస్తున్నామని ఇన్‌స్పెక్టర్ అర్జున్ తెలిపారు. శుక్రవారం టీటీఐ అధికారులు ఎల్బీనగర్, కాకతీయ స్కూల్, జిల్లెలగూడ ఇండియన్ స్కూల్ ఆఫ్ ఎక్సలెన్స్ లార్డ్స్ హైస్కూల్, చైతన్యపురి శ్రీచైతన్య స్కూల్, మీర్‌పేట భాష్యం స్కూల్, బైరామల్‌గూడ, నలంద హై స్కూల్‌లను సందర్శించి, విద్యార్థులకు నిబంధనలపై అవగాహనకు వీడియో క్లిప్స్ ప్రదర్శించామన్నారు. ఏబీసీ ఆఫ్ రోడ్ సేఫ్టి రూల్స్ బుక్ లెట్స్ విద్యార్థులకు అందజేశామన్నారు. 12 అవగాహన కార్యక్రమాల్లో 1215 మంది విద్యార్థులు పాల్గొన్నారని తెలిపారు.

ఘనంగా దీక్షా దివస్


ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి ఆధ్వర్యంలో దీక్షాదివస్‌కు తరలివెళ్తున్న బీఆర్ఎస్ శ్రేణులు

ఎల్బీనగర్, నవంబరు 29(ఆంధ్రజ్యోతి): డిసెంబర్ 29 తెలంగాణ రాష్ట్ర ఉద్యమ చరిత్రను మలుపు తిప్పిన రోజని ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి అన్నారు. శుక్రవారం శంషాబాద్‌లో బీఆర్ఎస్ రంగారెడ్డి జిల్లా కమిటీ ఆధ్వర్యంలో చేపట్టిన దీక్షా దివస్‌లో పాల్గొనేందుకు ఎల్బీనగర్ నియోజకవర్గ పార్టీ శ్రేణులు ఎమ్మెల్యే ఆధ్వర్యంలో తరలివెళ్లారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలంగాణ వచ్చుడో కేసీఆర్ సచ్చుడో అని నినదించి రాష్ట్ర సాధన కోసం మృత్యువును సైతం ముద్దాడేందుకు కేసీఆర్ తెగించారన్నారు. తెలంగాణ జాతిపిత, ఉద్యమ నేత కేసీఆర్ పోరాట స్ఫూర్తిని స్మరించుకుంటూ యావత్ ప్రజానికాన్ని జాగృతం చేస్తు డిసెంబరు 29న దీక్షా దివస్‌ను జరుపుకుంటున్నామన్నారు. కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్లు జిన్నారం విఠల్‌రెడ్డి, కొప్పుల విఠల్‌రెడ్డి, బీఆర్ఎస్ నాయకులు మధుసాగర్, రాజిరెడ్డి, అరవింద్‌రెడ్డి, జగన్నాథరెడ్డి, చింతల రవికుమార్, సత్యంచారి, చందు పాల్గొన్నారు.

రాష్ట్ర ఏర్పాటుకు దీక్షా దివస్ పునాది రాయి

ఎల్బీనగర్ : తెలంగాణ రాష్ట్ర ఏర్పాటుకు దీక్షా దివస్ పునాది రాయి వంటిదని తెలంగాణ బీసీ కమిషన్ మాజీ సభ్యుడు ఉపేంద్ర అన్నారు. దీక్షా దివస్ సందర్భంగా రంగారెడ్డి జిల్లా కోర్టు వద్ద జరిగిన కార్యక్రమంలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రం కోసం కేసీఆర్ ఆమరణ నిరాహారదీక్ష చేశారన్నారు. తెలంగాణ ఉద్యమంలో సబ్బండ వర్గాల ప్రజలు పాల్గొనగా ఉద్యమకారులు ప్రాణత్యాగం చేశారన్నారు. దీంతో తలొగ్గిన కేంద్రం తెలంగాణ ఏర్పాటు చేస్తున్నట్లు ప్రకటించిందన్నారు. పంచాయతీరాజ్ ట్రిబ్యూనల్ మాజీ సభ్యుడు పులిగారి గోవర్ధన్‌రెడ్డి మాట్లాడుతూ కేసీఆర్ దీక్ష చేపడుతున్న సందర్భంగా న్యాయవాదులం కోర్టు వద్ద వంద రోజుల పాటు ఉద్యమం కొనసాగించామన్నారు. కార్యక్రమంలో న్యాయవాదులు కే. గోవర్ధన్‌రెడ్డి, రవికుమార్, సదానందం, రామచంద్రరావు, మంత్రి రవీంద్రరావు, సత్యనారాయణరెడ్డి, నర్సింహచారి, పవన్, భిక్షమయ్య పాల్గొన్నారు.

సరూర్‌నగర్ : దీక్షా దివస్‌ను మీర్‌పేట్, బడంగ్‌పేట్ కార్పొరేషన్లలో బీఆర్ఎస్ నాయకులు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మీర్‌పేట్‌లోని నంది హిల్స్ చౌరస్తాలో, బడంగ్‌పేట్‌లోని బీఆర్ఎస్ పార్టీ కార్యాలయం వద్ద గులాబీ జెండాలు ఎగురవేశారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు, కార్పొరేటర్లు పాల్గొన్నారు.

చాదర్‌ఘాట్ : తెలంగాణ రాష్ట్ర సాధన కోసమే చేపట్టిన తెలంగాణ ఉద్యమ చరిత్రను 2009 నవంబరు 29వ తేదీ నుంచి 11 రోజుల పాటు నిర్వహించిన కేసీఆర్ దీక్ష మలుపుతిప్పి తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు ప్రక్రియను ఢిల్లీకి వినిపించారని బీఆర్ఎస్ గ్రేటర్ ప్రధాన కార్యదర్శి ఆజంఅలీ అన్నారు. దీక్షా దివస్ కార్యక్రమాన్ని పురస్కరించుకుని ఆజంపుర నుంచి తెలంగాణ భవన్‌కు మలక్‌పేట బీఆర్ఎస్ ఇన్‌చార్జి తీగల అజిత్‌రెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించిన భారీ ర్యాలీని ఆయన జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రాన్ని సాధించి పెట్టిన మాజీ సీఎం కేసీఆర్ నాయకత్వాన్ని బలపరచాల్సిన అవసరం ఎతైన ఉందని ఆయన పిలుపునిచ్చారు. కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ సామ ప్రభాకర్‌రెడ్డి, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ అనితనాయక్, వైస్ చైర్మన్లు కొరుడు భూమేష్, సాయ భువనేశ్వరీ, మాజీ డైరెక్టర్లు నూలి శ్రీధర్‌రావు, యాదగిరి, రవీందర్‌రెడ్డి, రాముయాదవ్, అభిషేకం, నాయకులు కామేష్, నర్సింగ్, ఆనంద్ పాల్గొన్నారు.

రైతన్నకు అండగా కాంగ్రెస్ ప్రభుత్వం

- గడ్డిఅన్నారం మార్కెట్ కమిటీ చైర్మన్ చిలుక మధుసూదన్‌రెడ్డి


మాట్లాడుతున్న చైర్మన్ మధుసూదన్‌రెడ్డి

అబ్దుల్లాపూర్‌మెట్, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ ప్రభుత్వం రైతన్నకు సంపూర్ణంగా అండగా ఉంటుందని గడ్డిఅన్నారం మార్కెట్ కమిటీ చైర్మన్ చిలుక మధుసూదన్‌రెడ్డి అన్నారు. ప్రభుత్వం నిర్వహిస్తున్న రైతు పండగలో భాగంగా శుక్రవారం బాటసింగారంలోని పండ్ల మార్కెట్‌లో పాలక వర్గం సభ్యులు సమావేశమై రైతు పండగ నిర్వహణపై చర్చించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన చిలుక మధుసూదన్‌రెడ్డి మాట్లాడుతూ దేశంలో ఎక్కడ లేని విధంగా తెలంగాణాలోని కాంగ్రెస్ ప్రభుత్వం రైతులందరికీ రుణమాఫీ చేసిందని అన్నారు. రుణమాఫీ వల్ల రైతులు ఆనందంగా ఉన్నారని తెలిపారు. వరి సాగులో తెలంగాణ దేశంలో మొదటి స్థానంలో నిలిచిందని దీనంతటికి ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డే కారణం అన్నారు. సన్నాలకు రూ. 500 బోనస్ ఇస్తున్న రాష్ట్రం కేవలం తెలంగాణ మాత్రమే అన్నారు. కొహెడాలో రూ. 2వేల కోట్లతో సమీకృత వ్యవసాయ మార్కెట్‌ని నిర్మించడానికి ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు గ్రీన్‌సిగ్నల్ ఇచ్చారని అన్నారు. త్వరలో పనులు ప్రారంభించనున్నట్లు ఆయన స్పష్టం చేశారు. శనివారం నిర్వహించనున్న రైతు సదస్సుకు లక్షలాది మంది రైతులు హాజరుకావాలని కోరారు. కార్యక్రమంలో వైస్ చైర్మన్ భాస్కరాచారి, పాలక వర్గం సభ్యుడు జైపాల్‌రెడ్డి, అంజయ్య, లక్ష్మి, మచ్చేందర్‌రెడ్డి, రఘుపతిరెడ్డి, గణేష్‌నాయక్, మధుసూదన్‌రావు, నవరాజ్, గోవర్ధన్‌రెడ్డి, వెంకట్‌గుప్తా, ఇబ్రహీం, ఉన్నత శ్రేణి కార్యదర్శి శ్రీనివాస్ పాల్గొన్నారు.

వీహెచ్‌పీఎస్ ఆధ్వర్యంలో వికలాంగుల కార్యాలయం ముట్టడి


కార్యాలయం ఆవరణలో బైటాయించిన వీహెచ్‌పీఎస్ నాయకులు

ఓల్డ్‌మలక్‌పేట, నవంబర్ 29(ఆంధ్రజ్యోతి) : మందకృష్ణ మాదిగపై అసత్య ఆరోపణలు చేసిన వికలాంగుల కార్పొరేషన్ చైర్మన్ ముత్తినేని వీరయ్య బేషరతుగా క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేస్తూ శుక్రవారం వికలాంగుల హక్కుల పోరాట సమితి(వీహెచ్‌పీఎస్)ఆధ్వర్యంలో మలక్‌పేటలోని వికలాంగుల కార్పొరేషన్ కార్యాలయాన్ని ముట్టడించారు. ముందుగానే సమాచారం అందుకున్న పోలీసులు వీహెచ్‌పీఎస్ నాయకులను కార్యాలయం లోపలికి వెళ్లకుండా అడ్డుకున్నారు. దీంతో సుమారు గంట పాటు కార్యాలయంలో బైటాయించారు. ఈ సందర్భంగా వీహెచ్‌పీఎస్ జాతీయ అధ్యక్షురాలు సుజాతాసూర్యవంశి, కోర్ కమిటీ చైర్మన్ అందె రాంబాబు మాట్లాడుతూ వికలాంగుల హక్కుల కోసం ఎంతో కృషి చేసిన మందకృష్ణపై లేనిపోని ఆరోపణలు చేయడం ముత్తినేని వీరయ్యకు తగదన్నారు. క్షమాపణ చెప్పకుంటే డిసెంబర్ 3న జరిగే జాతీయ వికలాంగుల దినోత్సవాన్ని అడ్డుకుంటామని హెచ్చరించారు. ఆరోజు ఎలాంటి సంఘటన జరిగినా సీఎం రేవంత్‌రెడ్డి బాధ్యత వహించాల్సి ఉంటుందని పేర్కొన్నారు. అనంతరర జనరల్ మేనేజర్ ప్రభంజన్‌రావుకు వినతిపత్రం సమర్పించి ఆందోళన విరమించి అక్కడి నుంచి వెళ్లిపోయారు. కార్యక్రమంలో వీహెచ్‌పీఎస్ నాయకులు ఎల్. గోపాల్‌రావు, పి. సత్యనారాయణ, కాళ్ల జంగయ్య, భవాని చౌదరి, పి. మంగమ్మ తదితరులు పాల్గొన్నారు.

మందకృష్ణ మాదిగను అగౌరవపరచలేదు

- వికలాంగుల కార్పొరేషన్ చైర్మన్ ముత్తినేని వీరయ్య


విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న ముత్తినేని వీరయ్య

ఓల్డ్‌మలక్‌పేట, నవంబరు 29(ఆంధ్రజ్యోతి) : తాను మందకృష్ణ మాదిగను ఏ మాత్రం అగౌరవపరచలేదని, ఆయనంటే చాలా గౌరవం,మర్యాద ఉందని కొందరు కావాలని నాపై దురుద్దేశంతో రాద్ధాంతం చేస్తున్నారని వికలాంగుల కార్పొరేషన్ చైర్మన్ ముత్తినేని వీరయ్య తెలిపారు. శుక్రవారం మలక్‌పేటలోని వికలాంగుల కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ మందకృష్ణతో వ్యక్తిగతంగా నాకు ఎలాంటి గొడవలు, విభేదాలు లేవన్నారు. నవంబరు 26న నిర్వహించిన సమావేశంలో తాను మందకృష్ణ ను ఒక్క మాటకూడా అనలేదన్నారు. గత అసెంబ్లీ ఎన్నికల్లో కానీ పార్లమెంట్ ఎన్నికల్లో కానీ బీజేపీ వికలాంగుల మ్యానిఫెస్టోలో ఏ ఒక్క అంశం కూడా ప్రకటించలేదని మీరు ఎందుకు మద్దతు ఇచ్చారని ప్రశ్నించానే తప్పా ఏ ఒక్క చెడుమాట మాట్లాడలేదన్నారు. కొందరు కావాలనే దురుద్దేశంతో లేనిపోని ఆరోపణలు సృష్టిస్తూ ఇబ్బందులకు గురిచేస్తున్నారని పేర్కొన్నారు. వికలాంగుల సంక్షేమం కోసం తాను కృషి చేస్తానన్నారు. సమావేశంలో నాయకులు కిరణ్, రాజ్యలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

బీజేపీ నాయకుల ముందస్తు అరెస్టు


ఆదిభట్ల పోలీస్ స్టేషన్‌లో కార్పొరేటర్ ఇంద్రసేన తదితరులు

అబ్దుల్లాపూర్‌మెట్, నవంబరు 29(ఆంధ్రజ్యోతి): ఎస్సీ, ఎస్టీ, బీసీ విద్యార్థుల సమస్యలను పరిష్కరించడంలో రాష్ట్ర ప్రభుత్వం నిర్లక్ష్యాన్ని నిరసిస్తూ మాసబ్ ట్యాంక్ దామోదరం సంక్షేమ భవనం వద్ద తలపెట్టిన నిరసన ప్రదర్శనకు బయలుదేరిన బీజేపీ నాయకులను హయత్‌నగర్, అబ్దుల్లాపూర్‌మెట్ పోలీసులు శుక్రవారం ముందస్తు అరెస్టులు చేసి పోలీస్‌స్టేషన్లకు తరలించారు. రాష్ట్ర ఓబీసీ మోర్చా కార్యవర్గ సభ్యుడు గుడెపు మధుగౌడ్‌ను హయత్‌నగర్ పోలీసులు అరెస్టు చేశారు. అబ్దుల్లాపూర్‌మెట్ పోలీసులు బీజేపీ మండల అధ్యక్షుడు బండిగారి విష్ణుగౌడ్, రాష్ట్ర బీసీ నాయకులు వడ్డెపల్లి పాపయ్యగౌడ్, కడారి అనిల్‌కుమార్, బొడిగె గోవర్ధన్‌గౌడ్, మద్ది శివకుమార్‌గౌడ్, శ్రావన్‌చారి, సురేష్‌గౌడ్, బాలాజీలను అరెస్టు చేశారు. ఈ సందర్భంగా వడ్డెపల్లి పాపయ్యగౌడ్ మాట్లాడుతూ రాష్ట్రంలో కాంగ్రెస్ పాలన గాడితప్పిందని అన్నారు. బీసీ, ఎస్సీ ఎస్టీ విద్యార్థులు ఉండే గురుకులాలు, వసతి గృహాల పరిస్థితి దారుణంగా ఉన్నా ప్రభుత్వం పట్టించుకోవడం లేదని విమర్శించారు. ఇప్పటికైనా రాష్ట్ర ప్రభుత్వం గురుకులాలు, వసతి గృహాలపైన దృష్టి సారించి విద్యార్థులను ఆదుకోవాలని కోరారు.

సరూర్‌నగర్ : గురుకులాల ముట్టడికి బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు కిషన్‌రెడ్డి పిలుపునిచ్చిన నేపథ్యంలో శుక్రవారం పలువురు బీజేపీ నేతలను ముందస్తుగా అరెస్టు చేసి పోలీసు స్టేషన్‌కు తరలించారు. నాదర్‌గుల్ 8వ డివిజన్ కార్పొరేటర్ గూడెపు ఇంద్రసేనతో పాటు పార్టీ నాయకులు చిత్రం నరేశ్, హరీశ్ తదితరులను తెల్లవారు జామున వారి ఇళ్ల వద్ద అరెస్టు చేసి ఆదిభట్ల పీఎస్‌కు తరలించారు. సాయంత్రం వ్యక్తిగత పూచీకత్తుపై విడుదల చేశారు.

మైనర్‌పై లైంగిక దాడికి యత్నం

- పోక్సో కేసులో నిందితుడికి మూడేళ్ల జైలు

హైదరాబాద్ సిటీ : మైనర్ పట్ల అసభ్యకరంగా ప్రవర్తించడమే కాకుండా లైంగిక దాడికి యత్నించిన నిందితుడికి న్యాయస్థానం మూడేళ్ల జైలు శిక్ష విధించింది. ఎల్బీనగర్ ఎన్‌టీఆర్‌నగర్‌కు చెందిన బుష్పాక ఆంజనేయులు(27) అదే ప్రాంతానికి చెందిన మైనర్‌పై కన్నేశాడు. బాలిక పట్ల అసభ్యకరంగా ప్రవర్తించడమే కాకుండా లైంగిక దాడికి యత్నించాడు. బాధితురాలి ఫిర్యాదు మేరకు ఎల్బీనగర్ పోలీసులు పోక్సో కేసు నమోదు చేసుకొని, దర్యాప్తు చేసి కోర్టులో చార్జ్‌షీట్ దాఖలు చేశారు. ఈ కేసును విచారించిన రంగారెడ్డి జిల్లా ప్రత్యేక ఫాస్ట్‌ట్రాక్ కోర్టు న్యాయమూర్తి నిందితుడు ఆంజనేయులుకు మూడేళ్ల కఠిన కారాగార శిక్షతోపాటు రూ. 6వేల జరిమానా బాధితురాలికి రూ. 1లక్ష పరిహారం అందించాలని తీర్పును వెలువరించారు.

వ్యవసాయ క్షేత్రాన్ని సందర్శించిన సాఫ్ట్‌వేర్ ఇంజనీర్లు

అబ్దుల్లాపూర్‌మెట్, నవంబరు 29(ఆంధ్రజ్యోతి): నగర శివారు తారామతిపేట గ్రామ పరిధిలోని జాతీయ ఆదర్శ రైతు నాగరత్నంనాయుడు వ్యవసాయ క్షేత్రాన్ని వేదాన్షీ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఈవై, గుడ్ ఎర సాఫ్ట్‌వేర్ సంస్థల ఇంజనీర్లు శుక్రవారం సందర్శించారు. సుమారు 200 మంది సాఫ్ట్‌వేర్ ఇంజనీర్లు వ్యవసాయ క్షేత్రంలో కలియతిరిగారు. పంటల సాగు, వ్యవసాయ పద్ధతులను క్షుణ్ణంగా పరిశీలించారు. వ్యవసాయ రంగం గురించి, అందులో అవలంబిస్తున్న పద్ధతుల గురించి ఇంజనీర్లకు నాయుడు అవగాహన కల్పించారు. అనంతరం ఇంజనీర్లు వరి పంటను కోత కోశారు.


బైకుపై పెండింగ్ చలానాల పట్టికను చూపుతున్న అధికారులు

బైకుపై 55 పెండింగ్ చలానాలు

- బైకు స్వాధీనం, రూ.11,605 జరిమానా

కొత్తపేట, నవంబరు 29(ఆంధ్రజ్యోతి): ఎల్బీనగర్ రింగ్ రోడ్డు వద్ద నో పార్కింగ్ జోన్‌లో ఉన్న ఒకే బైకుపై 55 ట్రాఫిక్ ఉల్లంఘన కేసులు నమోదయ్యాయి. ఆ బైకుపై చలానాలు పెండింగ్ చలానాలు, రూ.11,605 జరిమానా కూడా పెండింగ్‌లో ఉన్నట్లు గుర్తించిన ఎల్బీనగర్ ట్రాఫిక్ పోలీసులు ఆ బైకును స్వాధీనం చేసుకున్నారు. ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ డీ.వెంకటేశ్వర్లు సిబ్బందితో కలిసి శుక్రవారం ఎల్బీనగర్ రింగ్ రోడ్డు వద్ద అక్రమంగా నిలిపి ఉంచిన బైకుల నంబర్ల ఆధారంగా తనిఖీ నిర్వహిస్తున్నారు. ఈ నేపథ్యంలో పిల్ల కిషోర్ అనే వ్యక్తికి చెందిన ఏపీ07ఏవై9588 నంబరు గల బైకుపై 8నెలల వ్యవధిలో 55 పెండింగ్ చలానాలు నమోదైనట్లు వెల్లడైంది. నో పార్కింగ్ జోన్‌లో వాహనాలు నిలిపి ఉంచితే చట్టపరంగా చర్యలు తీసుకుంటామని ఆయన హెచ్చరించారు. ఈ తనిఖీల్లో ఎల్బీనగర్ ట్రాఫిక్ అదనపు ఇన్‌స్పెక్టర్ నాగరాజు, ఎస్ఐ మధుసూదన్, సిబ్బంది పాల్గొన్నారు.

వికలాంగుల కమిషన్‌ను ఏర్పాటు చేయాలి

- డ్వాబ్ అధ్యక్షుడు అంజయ్యగౌడ్

వనస్థలిపురం, నవంబరు 29(ఆంధ్రజ్యోతి): 2016 వికలాంగుల హక్కుల చట్టంలోని ఆర్టికల్79(1) ప్రకారం వికలాంగుల సంక్షేమ కార్యక్రమాలను పర్యవేక్షించడానికి జూడిషియల్ పవర్ కలిగినటువంటి కమిషన్ వెంటనే నియమించాలని డెవలప్‌మెంట్ అండ్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆఫ్ ది బ్లైండ్(డ్వాబ్) అధ్యక్షుడు జీ.అంజయ్యగౌడ్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. గురువారం వనస్థలిపురంలోని రాష్ట్ర కార్యాలయంలో ఆల్ ఇండియా కాన్ఫడరేషన్ ఆఫ్ ది బ్లైండ్ ఉపాధ్యక్షుడు పి.చొక్కారావుతో కలిసి అంజయ్యగౌడ్ మాట్లాడుతూ ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ వర్గాల ప్రజల కోసం ప్రభుత్వం కమిషన్‌ను ఏర్పాటు చేసిన విధంగానే హైకోర్టుకు ఇచ్చిన గడువులోపు వికలాంగుల కమిషన్‌ను ఏర్పాటు చేసి తమ అభ్యున్నతికి కృషి చేయాలని కోరారు. ఇదే విషయంపై రాష్ట్ర హైకోర్టును తాము అభ్యర్థించడంతో రాష్ట్ర ప్రభుత్వాన్ని 2024 డిసెంబరు 2 వరకు వికలాంగుల కమిషనర్‌ను నియమించాలని హైకోర్టు ఆదేశించడం జరిగిందన్నారు. హైకోర్టుకు ఇచ్చిన సమయం లోపే తమ వికలాంగుల కమిషన్‌ను ఏర్పాటు చేయాలని కోరారు.

ఆర్టీసీ డిపోల్లో కార్తీక వనభోజనాలు


దిల్‌సుఖ్‌నగర్ డిపోలో వనభోజనంలో డిప్యూటీ ఆర్ఎం సుచరిత, డీఎం సమత తదితరులు

హయత్‌నగర్, నవంబరు 29(ఆంధ్రజ్యోతి): హయత్‌నగర్ ఆర్టీసీ-1 డిపో శుక్రవారం కార్తీక వనభోజనాలు నిర్వహించారు. ఉన్నతాధికారులు ఆదేశం మేరకు కార్మికులు, వారి కుటుంబ సభ్యులతో కలిసి ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. అనంతరం కుటుంబ సభ్యులకు ఆటల పోటీలను నిర్వహించారు. గెలుపొందిన కుటుంబ సభ్యులకు డిపో మేనేజర్ విజయ్ బహుమతులు ప్రదానం చేశారు. ఈ సందర్భంగా డిపో మేనేజర్ విజయ్ మాట్లాడుతూ దాదాపు 400 మంది కార్మికుల కుటుంబ సభ్యులు వనభోజన కార్యక్రమంలో పాల్గొన్నారని తెలిపారు. సహా మేనేజర్లు శ్రీనివాస్, విజయకుమారి, సత్తయ్య, నరేష్, లక్ష్మన్, వెంకటేశ్ పాల్గొన్నారు.

చాదర్‌ఘాట్ : ఆర్టీసీ దిల్‌సుఖ్‌నగర్ డిపోలో శుక్రవారం కార్మికుల సాంస్కృతిక కార్యక్రమాల నడుమ కార్తీక వనభోజన కార్యక్రమం ఘనంగా జరిగింది. హైదరాబాద్ సిటీ రీజియన్ డిప్యూటీ ఆర్ఎంలు సుచరిత, జగన్, డిపో మేనేజర్ టి.సమత, సీఐ వెంకన్న, ఎంఎఫ్ వెంకటేశ్‌తోపాటు అనేక మంది కార్మికులు తమ కుటుంబీకులతో కలిసి వనభోజన మహోత్సవంలో పాల్గొని ఆడి, పాడి సందడి చేశారు.

మౌంట్ ఒపెరాలో విద్యార్థులపై తేనే టీగల దాడి

అబ్దుల్లాపూర్‌మెట్, నవంబరు 29(ఆంధ్రజ్యోతి): నగర శివారు బాటసింగారంలోని మౌంట్ ఒపేరా సందర్శనకు వచ్చిన స్కూల్ విద్యార్థులపై తేనె టీగలు దాడి చేసిన సంఘటన అబ్దుల్లాపూర్‌మెట్ పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. నగరంలోని వివిధ స్కూళ్లకు చెందిన విద్యార్థుల శుక్రవారం మౌంట్ ఒపేరా సందర్శనకు వెళ్లారు. మౌంట్ ఒపేరాలో విద్యార్థులు తిరుగుతున్న సమయంలో తేనే టీగలు వారిపై దాడి చేశాయి. ముగ్గురు విద్యార్థులను తేనే టీగలు కుట్టాయి. నిర్వహకులు వెంటనే విద్యార్థులను ఆస్పత్రికి తరలించి చికిత్స చేయించారు. అయితే తమపై తేనే టీగలు దాడి చేయడంతో పార్కును పూర్తి స్థాయిలో చూడలేదని టికెట్ డబ్బులను తిరిగి వాపసు ఇవ్వాలని విద్యార్థులు ఆందోళన చేశారు. రూ. 400 టికెట్ డబ్బులకు గాను రూ. 300 తిరిగి విద్యార్థులకు వాపసు చేశారు. దీంతో విద్యార్థులు ఆందోళన విరమించారు.